ప్రజాశక్తి

శనివారం 11 ఫిబ్రవరి 2023 8 పేజీలు





ఎన్‌టిఆర్ కృష్ణా

విఎంసి బడ్జెట్‌పై కసరత్తు

అధికారులతో కమిషనర్ సమావేశం



ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ రూపకల్పనపై ఆయా విభాగాల ఉన్నతాధికారులతో కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో కసరత్తు చేశారు. విఎంసి బడ్జెట్‌పై ఈ నెలాఖరులో లేదా వచ్చే నెల మొదటివారంలో జరిగే కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టే బడ్జెట్‌పై విభాగాల వారీగా జమా ఖర్చుల అంచనాలపై ఓ నిర్ణయానికి రావడానికి ప్రాథమికంగా చర్చించినట్లు తెలిసింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సుదీర్ఘంగా చర్చించినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుత (2022-23) ఆర్థిక సంవత్సరం బడ్జెట్ రూ.1,114 కోట్లను ఆధారం చేసుకొని ఆయా విభాగాలకు చేసిన కేటాయింపులు, వాటి ఖర్చులు, ప్రభుత్వాల నుంచి వాస్తవ రాబడి తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని, వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌పై ఓ అంచనాకు వస్తున్నట్లు తెలిసింది. వాస్తవ అంచనాలకు దగ్గరగా ఉండేలా అధికారులు ప్రతిపాదనలు, అంచనాలు సిద్ధం చేయాలని కమిషనర్ కోరినట్లు తెలిసింది. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి క్యాపిటల్ ఖర్చుల రూపంలో రూ.500 కోట్లకుపైగా, అలాగే రెవెన్యూ ఖర్చుల రూపంలో రూ.180 కోట్లు మొత్తం రూ.680 కోట్ల వరకు సంబంధిత అధికారులు చూపినట్లు తెలిసింది. అమృత్ పథకం కింద రూ.50 కోట్లు, 15వ ఆర్థిక సంఘం కింద రూ.40 కోట్లు, గడపగడపకు మన ప్రభుత్వం కింద వచ్చిన అర్జీల పనులకు రూ.6 కోట్లు, జిల్లా మినరల్ ఫండ్ కింద రూ.6 కోట్లు, నాడు-నేడు కింద మరో రూ.40 కోట్లు అవసరం ఉండవచ్చని ఇంజినీరింగ్ అధికారులు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిసింది. అలాగే ప్రజారోగ్య విభాగం కూడా యూజర్ చార్జీలు, డిఅండ్ఒ ట్రేడ్ లైసెన్స్ ఫీజులు తదితర వాటికి ఎంతెంత రాబడి పెరగవచ్చని అవగాహనకు వచ్చినట్లు తెలిసింది. ప్రతి పద్దు కింద రూ.2 కోట్ల నుంచి నాలుగైదు కోట్ల రూపాయల వరకు జనాల నుంచి ఫీజుల రూపంలో రాబట్టాలనే దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆదాయాల రూపంలో బడ్జెట్ బుక్‌లో ప్రతి ఏటా చూపించడమే తప్ప ఆచరణలో నిధులు మంజూరు కావడం లేదని, దీంతో ప్రతి ఒక్కటీ జనరల్ ఫండ్‌లో నుంచే ఖర్చు చేయాల్సి రావడంపై అధికారుల మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కానీ, అంతక ముందు ఏడాది కానీ వీటన్నింటినీ బేరీజు వేసుకొని వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఖర్చులు అధిగమించాలంటే తప్పని సరిగా ఆయా ఫీజుల రూపంలో ప్రజలపై భారం వేసే దిశగా బడ్జెట్ రూపకల్పనలో అధికారులు నిమగ్నమైనట్లు తెలిసింది.

బిపిటికి గిరాకీ !

- 76 కిలోల బస్తాకు రూ.1850లకు కొనుగోలు
- అనూహ్యంగా పెరిగిన బియ్యం ధరలు






ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

ప్రభుత్వాల విధానాలు, సాగు వ్యయం పెరగడం తదితర కారణాలతో బిపిటి 5204 వరి సాగుకు రైతులు వెనుకంజ వేస్తున్నారు. డిసెంబర్ నెలాఖరు వరకు ప్రభుత్వ మద్దతు ధర అందడమే గగనంగా ఉన్న ఈ రకం ధాన్యానికి ఫిబ్రవరి మొదటివారంలో అనూహ్యంగా గిరాకీ ఏర్పడింది. 76 కిలోల బస్తాను రూ.1800 నుంచి రూ.1850కు ప్రయివేటు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో మార్కెట్‌లో సన్న బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. మూడు నెలల కాలంలోనే కిలోకు రూ.5 ధర పెరిగింది. నాగాయలంక, కోడూరు, అవనిగడ్డ, బందరు రూరల్, పెడన, కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లో అత్యధిక విస్తీర్ణంలోనూ బిపిటి 5204 వరి సాగవుతోంది. మూడేళ్ల క్రితం వరకు జిల్లావ్యాప్తంగా 80 వేల ఎకరాల్లో సాగయింది. మార్కెట్‌లో డిమాండ్ ఉందనే కారణాన్ని సాకుగా చూపుతూ ఈరకం ధాన్యం సేకరణను ప్రభుత్వం నిలిపివేసింది. ఖరీఫ్ ధాన్యాన్ని నూర్చిన వెంటనే నవంబర్, డిసెంబర్ నెలల్లో వ్యాపారులు, మిల్లర్లు కొనుగోలు చేయడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో రైతులు అమ్ముకోవాలన్నా ఇతర రకాల ధాన్యంకన్నా బస్తాకు రూ.300 నుంచి రూ.400 వరకు తగ్గించి అమ్ముకోవాల్సి వస్తోంది. తడిచిన ధాన్యం అమ్మడం గగనంగా మారింది. దీంతో క్రమేణా సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. ఈఏడాది 55 వేల ఎకరాల విస్తీర్ణంలో మాత్రమే ఈ రకం సాగయింది. ఈ ఏడాది సైతం డిసెంబర్ నెలాఖరు వరకు ఈరకం ధాన్యం ధరలు తక్కువగానే ఉన్నాయి. ఏ గ్రేడ్ ధాన్యం 75 కిలోల బస్తాకు రూ.1545కు ప్రభుత్వం సేకరించింది. వ్యాపారులు బిపిటికి బస్తాకు రూ.1400కు మాత్రమే కొనుగోలు చేశారు. 15 వేల ఎకరాల్లో సాగైన బిపిటిని రైతులు తక్కువ ధరకే అమ్ముకున్నారు. స్థానిక లభ్యత తగ్గడంతో ఒక్కసారిగా డిమాండ్ ఏర్పడింది. కోడూరు, నాగాయలంక ప్రాంతాల్లో బస్తాకు రూ.1800 నుంచి రూ.1850 వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

బియ్యం ధరలకు రెక్కలు

అత్యంత నాణ్యత కలిగిన ఈరకం సన్న బియ్యాన్ని మధ్యతరగతి ఆదాయ వర్గాల ప్రజలు అత్యధికంగా వినియోగిస్తారు. సోనా మసూరి, కర్నూలు సోనా బిపిటిల పేరుతో మార్కెట్‌లో విక్రయిస్తారు. బ్రాండెడ్ కంపెనీలకు చెందిన హెచ్‌ఎంటి రైస్ 26 కిలోల బ్యాగు రిటైల్ మార్కెట్‌లో గత ఏడాది నవంబర్ చివరివారంలో రూ.1300కు విక్రయించారు. జనవరిలో రూ.1375కు పెరిగింది. ఫిబ్రవరిలో వాటి ధర రూ.1430కు పెరిగింది. మూడు నెలల వ్యవధిలో కిలో బియ్యం ధర రూ.5 వరకు పెరిగింది. రైస్ మిల్లుల్లో మరపట్టి విక్రయించే బియ్యం ధరలు కిలో రూ.38 నుంచి రూ.42.30కు పెరిగాయి. వీటి ధర రూ.4.30 వరకు పెరిగింది. పంటసాగు విస్తీర్ణం తగ్గిపోవడంతో స్థానికంగా డిమాండ్‌కు తగిన సరఫరా లేకుండా పోయింది. తెలంగాణాలోని పలు ప్రాంతాల నుంచి బియ్యాన్ని వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. రవాణా ఛార్జీలు, టోల్‌టాక్స్‌లు, ఇతరత్రా పన్నులు భారాల కారణంగా ఈరకం బియ్యం ధరలు అనూహ్యంగా పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

వార్తలు టాబ్లాయిడ్ లోపలి పేజీల్లో



ప్రజానుకూల విధానాల అమలుకు పోరాటం

దివాకర్ వర్ధంతి సభలో బాబూరావు

పుస్తకాలు, ఆహారం పంపిణీ చేస్తున్న బాబూరావు, సత్యబాబు, ఆదిలక్ష్మి

వార్త 8లో



ముఖాముఖిలో మాట్లాడుతున్న ఓల్గా

స్త్రీ, పురుష సమానత్వంపై సాహిత్యం ద్వారా చైతన్యం : ఓల్గా

వార్త మెయిన్ పేజీలో



పుస్తకావిష్కరణలో మాట్లాడుతున్న తెలకపల్లి రవి

శ్రీశ్రీ కవిత్వం అజరామరం :రాచపాళెం

తెలకపల్లి రచించిన 'శ్రీశ్రీ జయభేరి' పునరావిష్కరణ

కన్నుల పండువగా వీరమ్మ శిడిబండి వేడుక



పట్టణ వీధుల్లో వీరమ్మ శిడిబండి యాత్ర

ప్రజాశక్తి - ఉయ్యూరు: స్థానిక వీరమ్మ శిడి బండి వేడుక శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పదిహేను రోజుల తిరునాళ్లలో పదకొండవ రోజున అమ్మవారి శిడిబండి ఉత్సవం నేత్ర పర్వంగా నిర్వహిస్తారు. శివాలయం రోడ్డులో పాత వాటర్ ట్యాంక్ సమీపం నుంచి సాయంత్రం బయలుదేరిన శిడిబండికి దారిపొడవునా మహిళలు హారతులిచ్చి పసుపుకుంకుమలతో నీరు వారబోస్తూ స్వాగతం పలికారు. ప్రధాన సెంటర్ నుంచి అమ్మవారి ఆలయం వరకు వేలాది మంది చిన్నా పెద్దా తేడాలేకుండా వద్దులు సైతం శిడిబండి వెంట నడిచారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం ఎస్సీ కాలనీకి చెందిన ఓకుటుంబంలో వివాహానికి సిద్ధంగా ఉన్న యువకుడు (పెళ్లి కొడుకు) డప్పువాయిద్యాలతో ఊరేగి వచ్చి ఆలయం వద్ద శిడిబండికి కట్టిన ఉట్టి బుట్టలో కూర్చుని అమ్మవారి ఆలయ ప్రదక్షిణ చేశారు. తిరునాళ్ళలో అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్న శిడిబండి వేడుక తిలకించేందుకు పలు ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. పట్టణ రహదారులు జనసంద్రంగా కన్పించాయి.

భారీ పోలీసు బందోబస్తు

శిడిబండి వేడుక పురస్కరించుకుని ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గన్నవరం జోన్ డీఎస్పీ కె.విజయ్పాల్ ఆధ్వర్యంలో పలు స్టేషన్లకు చెందిన 200 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేశారు.

కార్మికులు సంఘటితంగా ఉద్యమించాలి

● సిపిఎం సీనియర్ నాయకులు, కార్మిక నేత పి.దివాకర్ 19వ వర్ధంతి సభలో సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కార్మికులు, ప్రజలు సంఘటితమై ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు తెలిపారు. శుక్రవారం పాతబస్తీ 50 డివిజన్ వించిపేటలో పి. దివాకర్ 19వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా దివాకర్ చిత్రపటానికి సిహెచ్ బాబూరావు, సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పళ్ళు పంపిణీ చేశారు. పేదలకు అల్పాహారం అందించారు. అనంతరం బాబూరావు, బోయి సత్యబాబులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ తీరుపై మోడీ జవాబు చెప్పాలన్నారు. అదాని, అంబానీ, కార్పొరేట్ల అనుకూల విధానాలే ఆర్థిక సంక్షోభాలకు మూలమన్నారు. కార్మిక చట్టాలను, కార్మిక శాఖలను నిర్వీర్యం చేసి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్మికుల భద్రతను విస్మరించిన ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలే పరిశ్రమల్లో ప్రమాదానికి కారణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల అప్పులపై మోడీ సుద్దులు చెప్పటం కాదు, 8 ఏళ్లలో 70 లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసిన కేంద్ర ప్రభుత్వ తీరుపై ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వైయస్సార్ ప్రభుత్వం పారదర్శకత లేకుండా, అవినీతి, అస్తవ్యస్త పాలనతో ఇష్టారాజ్యంగా అప్పులు చేస్తోందన్నారు. కార్పొరేట్లకు రాయితీలు ఇచ్చి అదానీ వంటి సంస్థలకు దోచిపెట్టడం వల్లే దేశం ఆర్థికంగా సతమతమవుతోందన్నారు. ఈ విషయాన్ని పక్కదారి పట్టించి మోడీ తన గొప్పలు చెప్పుకోవడం తగదన్నారు. దివాకర్ సుదీర్ఘ కాలం పాటు విజయవాడ నగరంలో ప్రజలకు సేవలు అందించారని, కార్మికులను కూడగట్టారు మత సమరస్యాన్ని పరిరక్షించడానికి అవిరళ కృషి చేశారని కొనియాడారు. వారి స్ఫూర్తితో కార్మిక, ప్రజా ఉద్యమాలను పెంపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు సూరిబాబు, పిళ్లా రాంబాబు, గాదె ఆదిలక్ష్మి, కొండారెడ్డి, సుబ్బారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిహెచ్ బాబూరావు తదితరులు

వార్డు వాలంటీర్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం : కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ : నగర పరిధిలోని 69 వార్డు వాలంటీర్ల ఎంపిక కోసం అర్హులయిన నిరుద్యోగ యువతీ యువకుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్లు నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ...విజయవాడ నగర పరిధిలో ఖాళీగా ఉన్న వార్డు వాలంటీర్ల పోస్టులను భర్తీ చేసేందుకు నిరుద్యోగ యువతీ యువకులన ఉంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు 10వ తరగతి ఉత్తీర్ణులైఉండాలని, ఈ నెల 8వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండి, 35 సంవత్సరాల లోపు వారై ఉండాలని, అలాగే నగర పరిధిలో నివశించు వారికి మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్లు కమిషనర్ అన్నారు. ఈ నెల 17లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాల కోసం అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్సు) లేదా వార్డు సెక్రటేరియట్ స్పెషల్ సెల్ ఫోన్ నెంబర్ 8185933187కు సంప్రదించాలని కోరారు.

ఇష్టంవచ్చినట్లు మాట్లాడితే సహించం : టిడిపి


ప్రజాశక్తి - వన్‌టౌన్ : మాజీ ఎమ్మెల్సీ, తెలుగుదేశం రాష్ట్ర నాయకుడు బుద్ద వెంకన్నపై వైసిపి నాయకుడు అరవ సత్యం ఇష్టం వచ్చినట్లు నోరు పారేసుకుంటే సహించేది లేదని తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి సొదరబోయిన ఏడుకొండలు ఘాటుగా హెచ్చరించారు. శుక్రవారం పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం కార్యాలయం (బుద్ద వెంకన్న కార్యాలయం)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడలో ఉన్న కొంతమంది ఆకు రౌడీలు నోటికి వచ్చినట్టు మాట్లాడుతూ నానా యాగీ చేస్తున్నారని విమర్శించారు. బుద్ద వెంకన్న పై అరవ సత్యం నోరు పారేసుకోవడం తగదని, ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే తాట తీస్తామని హెచ్చరించారు. అలాగే ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ను విమర్శించడం తగదని హెచ్చరించారు. దేవినేని నెహ్రూ దొడ్లో ఆశ్రయం పొందిన తర్వాత అరవ సత్యం ఆగడాలు అనేకం ఉన్నాయని అన్నారు. సమావేశంలో తెలుగుదేశం నాయకులు గణపా రాము, తెలుగుదేశం కార్పొరేటర్ ఉమ్మడి చంటి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణంలో పట్టణ ఎస్ఐ బి.వి.రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు సెల్ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసిన వారిపై, ముగ్గురు వ్యక్తులతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వారిపై 25 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'మన సచివాలయం- మన ఎంఎల్‌ఎ'

ప్రజాశక్తి-విజయవాడ : స్థానిక సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు 'మన సచివాలయం మన ఎమ్మెల్యే' కార్యక్రమానికి శుక్రవారం నిర్వహించారు. నియోజకవర్గం పరిధిలోని ముత్యాలంపాడులోని 211, 214 వ వార్డు సచివాలయాలలో ఎమ్మెల్యే అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రతి వార్డు సచివాలయ ఉద్యోగి తప్పని సరిగా మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటలవరకు ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం నిర్ణీత గడువులోగా జరగాలని ఆదేశించారు. సంక్షేమ క్యాలెండర్ పై ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. అలాగే ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు డివిజన్లో అభివృద్ధి పనులు కూడా వేగవంతం చేయాలన్నారు. శ్రీనగర్ కాలనీ, టీచర్స్ కాలనీలలో రూ. 61.84 లక్షల నిధులతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, యూజీడీ నిర్మాణ పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. అలాగే జెండా చెట్టు వీధిలో రూ. 15.69 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఇటీవల శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సజన, స్థానిక కార్పొరేటర్



పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి-చందర్లపాడు : చందర్లపాడు పట్టణంలోని శ్రీ అలివేలమ్మ తల్లి ఫంక్షన్ హాల్ లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు, శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్, నియోజకవర్గ పరిశీలకులూరు ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ పద్మావతిముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, ప్రభుత్వ పనితీరును వివరిస్తూ మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను గెలిపించుకోవడానికి గృహసారథులు అంకితభావంతో పని చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలు బాగుండాలని పాలన సాగిస్తున్నారని, అర్హత కలిగిన ఏ ఒక్కరికీ ప్రభుత్వం ద్వారా అన్యాయం జరగకూడదని దృఢ సంకల్పంతో పనిచేస్తు న్నారని చెప్పారు. అనంతరం గృహ సారథులకు "మా నమ్మకం నువ్వే జగనన్న" అనే కిట్లు బ్యాగులు అందజేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న అభివృద్ధి, సంక్షేమ పాలన : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో శుక్రవారం గడపగడపకు -మన ప్రభుత్వం కార్యక్రమంలో నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల క్యాలెండర్ ను అందజేస్తూ - ప్రభుత్వ పనితీరును వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పారదర్శక ,విలువలు, విశ్వసనీయతతో కూడిన పాలన సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యద్దనపూడి జోష్న, ఎంపీపీ మలక్ బషీర్, జడ్పిటిసి వేల్పుల ప్రశాంతి రమేష్, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ మార్త రజిని శ్రీనివాస్, నాయకులు చింతా రవీంద్ర, వేల్పుల శ్రీనివాసరావు, ఎంపిటిసి కర్ల రాధిక రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భావం : విజిఆర్ నారగోని

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రాష్ట్రంలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు వివిధ వర్గాల ప్రతినిధులతో సమగ్ర చర్చ తరువాత కొత్త రాజకీయపార్టీని స్థాపించాలని నిర్ణయించినట్లు ప్రముఖులు వీజీఆర్ నారగోని అన్నారు. ఎం.జి.రోడ్డులోని ఓ హోటల్‌లో శుక్రవారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 50 కులాల వారు అసెంబ్లీలో అడుగుపెట్టలేక పోయారన్నారు. ఒక్క బీసీ వ్యక్తి కూడా ముఖ్యమంత్రి కాలేదన్నారు. రెండు మూడు వర్గాలకే అధికారాన్ని పరిమితం చేస్తూ బలహీన వర్గాలను ఓటు బ్యాంకుగా పరిమితం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలో లక్ష మందిత బహిరంగ సభ నిర్వహిస్తామని పార్టీ జెండా, అజెండా రూపకల్పన జరుగుతుందన్నారు. విజయవాడ నగరంలో పార్టీ కేంద్ర కార్యాలయం ప్రారంభమవు తుందని తెలిపారు. మరో ప్రముఖులు రామకృష్ణయ్య మాట్లాడుతూ సీట్ల కోసం ప్రాధేయపడే స్థితి నుండి శాసించే స్థాయికి బడుగు బలహీన వర్గాల వారిని తీసుకువెళతామని తెలిపారు. ఈకార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు ప్రముఖులు పాల్గొన్నారు.

అడ్వకేట్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ పట్టణంలోని చేపల మార్కెట్ డౌన్ లో న్యాయవాదులు అద్దంకి మణిబాబు-సైదా ల సంయుక్తాధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన అడ్వకేట్ కార్యాలయాన్ని , ఆరో వార్డు కౌన్సిలర్ షేక్ యాకుబ్ వలీ గారి కార్యాలయాన్ని శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావుని లాయర్లు అద్దంకి మణిబాబు సైదా, కౌన్సిలర్ షేక్ యాకుబ్ వలీ శాలువాతో ఘనంగా సత్కరించారు.

దుర్గగుడి నూతన పాలకమండలి పరిచయం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గగుడి నూతన పాలక మండలి పరిచయ సమావేశం శుక్రవారం జరిగింది. ఇటీవల నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన దుర్గగుడి పాలకమండలితో బ్రాహ్మణ వీధి లోని జమ్మిదొడ్డి మీటింగ్ హాలు నందు ఆలయ కార్యనిర్వాహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ, పాలకమండలి చైర్మన్ కర్నాటి రాంబాబు, పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులతో పరిచయ సమావేశం జరిగింది. సమావేశం నందు పలు అంశములపై చర్చించారు. ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరు కాని కొలుకులూరి రామసీత పాలకమండలి సభ్యురాలిగా ప్రమాణం స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు కేసరి నాగమణి, కట్టా సత్తయ్య, బుద్దా రాంబాబు, దేవిశెట్టి బాలకృష్ణ, చింతా సింహాచలం, బచ్చు మాధవికృష్ణ, అనుమోలు ఉదయలక్ష్మి, నంబూరి రవి, చింకా శ్రీనివాసరావు, కొలుకులూరి రామసీత, అల్లూరి కృష్ణవేణి, తొట్టడి వేదకుమారి, కార్యనిర్వాహక ఇంజనీర్లు కోటేశ్వరరావు, ఎల్. రమాదేవి, సహాయ కార్యనిర్వాహణా ధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మణ దత్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మండలంలోని ముక్త్యాల గ్రామ సమీపంలో గల కెసిపి సిమెంట్స్ నందు శుక్రవారం కెసిపి సిమెంట్స్ వ్యవస్థాపకులు లక్ష్మణ దత్ విగ్రహాన్ని కెసిపి సిమెంట్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఇందిరా దత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ దత్ పారిశ్రామిక రంగానికి చేసినటువంటి సేవలను ఆమె కొనియాడారు ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, విజయవాడ పార్లమెంటరీ అధ్యక్షులు నెట్టెం రఘురాం, మాజీ శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్, కెసిపి సిమెంట్స్ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

రైతులను దగా చేస్తున్న ప్రభుత్వం : టిడిపి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణంలో ఎన్టీఆర్ జిల్లా పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురాం నివాసంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ రెడ్డి మూడేళ్ళ పాలనలో అన్నదాతలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారన్నారు. రైతు భరోసా, పంట నష్ట పరిహారం, సున్నా వడ్డీ రుణాలు, ధాన్యం కొనుగోళ్లు, రైతులకు యంత్రపరికరాల పంపిణీలో వైఫల్యం చెందారన్నారు. రైతు భరోసాలో రైతును దగా చేశారని, మోటార్లకు మీటర్లు పెడుతూ రైతుల మెడకు ఉరితాడు బిగిస్తున్నారన్నారు. రైతు ఆత్మహత్యల్లో ఏపీ దేశంలోనే 3వ స్థానానికి, కౌలు రైతు ఆత్మహత్యల్లో 2వ స్థానానికి నెట్టారని విమర్శించారు. రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి కొఠారి సత్యనారాయణ ప్రసాద్, జిల్లా తెలుగు రైతు అధికార ప్రతినిధి తాళ్లూరి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు కానూరి కిషోర్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మేక వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నందిగామ నగర పంచాయతీ వార్షిక బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ నగర పంచాయత్ కార్యాలయములో చైర్ పర్సన్ మండవ వరలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో 2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రవేశపెట్టారు. సదరు బడ్జెట్ నందు అన్ని గ్రాంటుల మొత్తము బడ్జెట్ రూ. 13.35 కోట్లు, మునిసిపల్ ఆదాయము రూ.9.48 కోట్లు, ఖర్చు రూ. 8.53 కోట్లు మిగులు మొత్తము రూ. 95.50 లక్షలు గా ఎజండా నందు పొందుపరిచారు. ఈ సమావేశమునకు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు 2023-24 ఆర్థిక సంవత్సరం యొక్క బడ్జెట్ ను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ డాక్టర్ ఎస్ జయరాం, నగర పంచాయతీ వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

నాగరత్నంను పరామర్శించిన ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నగర పంచాయతీ పంచాయతీ వైస్ చైర్మన్ మాడుగుల నాగరత్నమ్మ అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు శుక్రవారం ఆమెను పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు .

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి గ్రామములో గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానము నందు జరుగుచున్న నిత్యాన్నదాన పథకానికి సికింద్రాబాద్ తార్నాక కు చెందిన మాదల చేన్నకేశవరావు, హైమవతిలు రూ.50,004లు అందజేశారని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పసుపులేటి రాధాసుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆలయ సహాయకమిషనర్, కార్యనిర్వహణాధికారి డి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు.

కొత్త ఆలోచనల ప్రపంచంలోకి తీసుకెళ్లేది పుస్తకమే

● మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి-పెడన : కొత్త ఆలోచనల ప్రపంచంలోకి తీసుకెళ్లేది పుస్తకమేనని, తద్వారానే విజ్ఞాన వినోదాలను ఆస్వాదంచగలమని రాష్ట్ర మంత్రి జోగి రమేష్ అన్నారు. హైదరాబాద్ బుక్స్ వారి సౌజన్యంతో పెడన పట్టణంలోని సెయింట్ విన్సెంట్ పల్లోటి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 3 రోజులు పాటు జరగనున్న పుస్తక ప్రదర్శన మహోత్సవాన్ని మంత్రి జోగి రమేష్ శక్రవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ పుస్తకాలు మనలను మరింత జ్ఞానవంతులను చేస్తాయని, పుస్తకం నిజమైన స్నేహితుడని అన్నారు. మాతభాషపై ప్రేమ, అభిరుచి పెంపొందించ



లైబ్రరీని ప్రారంభిస్తున్న జోగి రమేష్

డానికి పుస్తకాలు ఉత్తమ సాధనమన్నారు. మాతృ భాషలోని పుస్తకాల నుండి ఇతిహాసాలు, నీతి కథలను చదవాలని ప్రోత్సహించిన తన చిన్ననాటి రోజులు ఇంకా గుర్తున్నాయన్నారు. చిన్నప్పటి నుంచీ పుస్తకాలను చదివేలా పిల్లలను ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. నేటి ఆధునిక సమాజంలో పుస్తకం స్థానంలో సెల్ ఫోన్ వినియోగం ఎక్కువైందని దయచేసి చిన్నారులు ఎవరు ఎక్కువ సమయం సెల్ ఫోన్ వాడి ఆరోగ్యపరమైన దుష్ప్రభావాలకు లోను కావద్దని మంత్రి ఈ సందర్భంగా సూచించారు. అంతకుముందు మంత్రి జోగి రమేష్ పల్లోటి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు అత్యాధునిక సౌకర్యాలతో విద్యార్థులకు మరింత ఉపయోగపడేలా నిర్మించిన భౌతిక, రసాయన మరియు జీవ శాస్త్ర పరిశోధనశాలలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పల్లోటి స్కూల్ కరస్పాండెంట్ జోజిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ బళ్ళ జ్యోత్స్న రాణి గంగయ్య, ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్, వైస్ చైర్మన్ మహమ్మద్ కాజా, బైలపాటి జ్యోతి, ఎంపీపీ రాజులపాటి వాణి అచ్యుతరావు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై నిరసన

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఆంధ్ర రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ మచిలీపట్నంలోని రుస్తుం బాధ శివాలయం సెంటర్లోని గాంధీ విగ్రహం వద్ద సిపిఐ మచిలీపట్నం నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్ మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్య మానవులు ఎవరికి ఉపయోగకరంగా లేదన్నారు. అదాని, అంబానీ లాంటి కార్పొరేట్ యజమా నుల ఆస్తులు రెండంతలుగా పెరగటానికి తప్ప పేదలకు ఏమి ఉపయోగపడదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్ ను పరిశీలన చేయాలని , అదాని ఆస్తులను జప్తు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ ఉపాధ్యక్షులు ఒంటి పులి లక్ష్మణరావు, గొడుగు రత్నకుమారి, మోదుమూడి నాగరాజు తురక లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలని ధర్నా

ప్రజాశక్తి-గన్నవరం

వ్యవసాయరంగానికి నిధులు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని సిపిఐ కార్యదర్శి పెద్దు వాసుదేవరావు డిమెండ్ చేశారు. ఆంధ్రప్రదేశే రైతు సంఘం పిలుపు మేరకు గన్నవారాం రైతుసంఘం ఆధ్వర్యంలో గన్నవరం బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట ధర్నా విర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కోత విధించటం దారుణమన్నారు. భవిష్యత్‌లో అప్పులు కూరుకుపోయి రైతు ఆత్మహత్యలు పెరిగే అవకకాశం ఎక్కుగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కామ్రేడ్ పెద్దు వెంకటరత్నం, కాట్రగడ్డ రామచంద్ర జోషి, ముక్కమాల ఉమామహేశ్వరవు, బండారు లక్ష్మయ్య, కటవరపు విజయరావు, కటవరపు మోహనరావు, తాటి శివరామకష్ణ పాల్గొన్నారు.

అంబేద్కర్ స్మృతివనం ఏర్పాటు చరిత్రాత్మకం

ప్రజాశక్తి-చల్లపల్లి : విజయవాడ నడిబొడ్డున పిడబ్ల్యుడి గ్రౌండ్ లో ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మృతివనం ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ ఆలోచన చారిత్రాత్మక నిర్ణయం అని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. స్థానిక అంబేద్కర్ భవనంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కొన్ని సామాజిక వర్గాలకు చెందిన నేతగా చిత్రీకరించే ప్రయత్నాలను తిప్పి కొట్టాలని అన్నారు. బిఆర్ అంబేద్కర్ జీవితం ప్రస్తుత ,భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయక గ్రంథం అని వివరించారు. విజయవాడలో అంబేద్కర్ స్మతి వనం ఏర్పాటు చేయడం ద్వారా భారతదేశంలో విజయవాడ ప్రముఖ పర్యాటక నగరంగా గుర్తింపు పొందుతుందని తెలిపారు. విగ్రహం నిర్మాణ ము, స్మతి వనం ఏర్పాటు విషయం లో నాణ్యత లో రాజీ పడకుండా , నిధుల కేటాయింపులు లోటు లేకుండా ప్రతిష్టాత్మకంగా ప్రాజెక్ట్ ను తీర్చిదిద్దాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు ప్రకాష్, ఎం సుబ్బారావు,ఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఐటి నిబంధనలపై అవగాహన ఉండాలి : డిఆర్‌ఒ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది ఆదాయపన్ను నిబంధనలు పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం కలక్టరేట్లో స్పందన మీటింగ్ హాలులో ఆదాయ పన్ను శాఖ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బందికి టిడిఎస్‌పై ఏర్పాటుచేసిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆదాయ పన్నుకు సంబంధించి నూతనంగా విధించిన నిబంధనలు ఆదాయపన్ను మదింపు విధానాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆదాయ పన్ను శాఖ డిప్యూటీ కమిషనర్ పి.ప్రేమ్ కుమార్ నూతన ఐటి నిబంధనలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాల విభజన వేపథ్యంలో నూతన జిల్లాల్లో డీడీవోలకు ఎవరికైనా ట్యాన్ (టిఎఎం) లేకపోతే వెంటనే ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ట్యాన్ (టిఎఎన్), పాన్ ఫ్రాడ్స్ జరగకుండా జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వచ్చే స్థూల పన్ను ఆదాయంలో ఆదాయపన్ను నుండి 50 శాతం పైగా వస్తోందన్నారు. దేశాభివృద్ధిలో ఐటి కీలకమన్నారు. కేంద్రం రోజు వారీ ఖర్చులు (వేస్ అండ్ మీన్స్) ఐటి ఆదాయం నుండి వినియోగిస్తారన్నారు. ఐటి విబంధనల ప్రకారం 65 ఏళ్ల దాటిన ఉద్యోగులు సీనియర్ సిటిజన్‌గా పరిగణింపబడతారని ఉద్యోగులు అడిగిన ప్రశ్నకు పి.ప్రేమ్ కుమార్ సమాధానమిచ్చారు. ఉద్యోగులు సరెండర్ లీవు, ఎన్ క్యాష్ మెంట్ క్రెడిట్ కావడం లేదని, ముందస్తు ఐటి మదింపులో పన్ను కట్టాల్సివస్తోందని ఉద్యోగులు ప్రస్తావించారు. పన్ను కట్టడమే మేలని, అయినప్పుడు పెనాల్టీ విధించాల్సిన అవసరం ఉండబోదన్నారు. ఈ సమావేశంలో ఐటి శాఖాధికారి, సీనియర్ టిఎ షరీఫ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'గ్రామదర్శిని' : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా) : ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువయ్యేందుకు, గ్రామాల్లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృష్ణాజిల్లా యంత్రాంగం 'గ్రామదర్శిని' అమలు చేస్తుందని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం మచిలీపట్నంలోని కలెక్టరేట్ స్పందన హాల్లో గ్రామదర్శిని ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ 'గ్రామదర్శిని' కార్యకమం ప్రకారం, వివిధ శాఖలకు చెందిన 100 మంది అధికారులు ప్రతి శుక్రవారం లేదా శనివారం కనీసం ఒక పంచాయతీని సందర్శించి, వారి పరిశీలనలపై తనకు నివేదించాలన్నారు. అధికారులు గహాల లేఅవుట్లు, నిర్వహణ వంటి ఆరు ముఖ్యమైన అంశాలపై ప్రత్యేకంగా నోట్స్ తీసుకొని, నాడు-నేడు ఆసుపత్రులు, పాఠశాలలు, పారిశుధ్యం, ప్రజా పంపిణీ బియ్యం (పిడిఎస్) వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బికె) గ్రామ సచివాలయాల



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

నిర్వహణలో నిమగ్నమవ్వాలన్నారు. పంచాయతీరాజ్, అంగన్‌వాడీ, గహనిర్మాణం, విద్యకు సంబంధించిన సమస్యలు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయని, సమస్యలు పరిష్కారమైనప్పుడు ఫోటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, డీపీఓ నాగేశ్వర్ నాయక్, మచిలీపట్నం ఆర్డీఓ ఐ కిషోర్, ఉయ్యూరు ఆర్డిఓ విజయకుమార్, డి ఆర్ డి ఏ పిడి, మెప్మా పిడి పి.ఎస్. ప్రసాద్, ముడా విసి నారాయణరెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ, సాధికారత అధికారిణి కె. సరస్వతి, డ్వామా పీడీ జివి సూర్యనారాయణ, డీఈవో తాహెరా సుల్తానా, ఐసిడిఎస్‌పి డి సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

పెదకళ్లేపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-మోపిదేవి : మండల పరిధిలోని పెదకళ్లేపల్లి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సౌజన్యంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ వారి ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం వద్ద హెల్త్ క్యాంప్ నిర్వహిం చారు. డాక్టర్ ఎన్.శ్రీరామ్ సాయి ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. హెచ్ఐవి, ఎయిడ్స్, టిబి, ఎస్టిఐ పట్ల అవగాహన కల్పించారు. హెచ్ఐవి సోకిన వ్యక్తి నుంచి మరొకరికి వ్యాపి స్తుందని, కలుషిత రక్త మార్పిడి, కలుషితమైన సూదులు, సిరంజులు, హెచ్ఐవి సోకిన తల్లి నుంచి పుట్టబోయే బిడ్డకు సక్రమమించకుండా తీసుకునే జాగ్రత్తల గురించి వివరించారు. హెచ్.ఈ వి.రాధ, హెచ్.వి ఎన్.ప్రమేళరాణి, ఎంవి హెచ్ఎస్ విజయసారధి, ఏఎన్ఎం బి.కుమారి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక మండల పరిషత్ సమావేశ హాల్లో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహించినట్లు ఎంపీడీవో దారపు శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్బికే కేంద్రాల ద్వారా ఏప్రిల్ నెలాఖరు వరకు ధాన్యం కొనుగోలు చేయాలని, వేసవికాలంలో పంట పోదులు కాలువలు పూడికతీతలను ఇరిగేషన్ శాఖ ద్వారా పనులు జరిపించాలని, అపరాల పంటకు ఈ కాపు ఈకేవైసీ నమోదు చేయాలని, రైతులకు విడివిడి పనిముట్లు వ్యవసాయ శాఖ ద్వారా అందజేయాలని ఈ సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు పెన్నేరు ప్రభాకర్ రావు, మండల తాసిల్దార్ రెహమాన్ మస్తానా, ఏవో సునీల్, మండల వి.ఎ.ఎ లు పాల్గొన్నారు.

విలువిద్య పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-పమిడిముక్కల : ఈనెల 13, 14, 15 తేదీలలో జరిగే విలువిద్య పోటీలకు వెళ్లే విద్యార్థులకు పమిడి ముక్కల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవ నారాయణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో కూడా ప్రావీణ్యం సాధించేందుకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు.



యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-కోడూరు : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డ్రగ్స్‌కు బానిస కావద్దని కోడూరు ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం సాయంత్రం సంత మార్కెట్ పరిసర ప్రాంతాల్లో, కోడూరు ప్రధానసెంటర్లో యువకులకు, ఆటో,రిక్షా డ్రైవర్ల కు గంజాయి, హెషిష్, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలు వాడుట వలన అవి మరణానికి దారితీస్తాయని, అలాంటి మత్తు పదార్థాలకు బానిసయై కన్న వారికి కడుపు కోత విధించవద్దని తెలిపారు. డ్రగ్స్ అమ్మకాల సమాచారం తెలిసిన ఎడల వెంటనే14500 లేక100 కాల్ చేసి పోలీసువారికి తెలియపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఆంజనేయులు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్లకాలనీకి సమీపంలో డంపింగ్ యార్డు

● ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి-కోడూరు : కోడూరులోని సాయిబాబా ఆల యం పక్కనే జగనన్న లేఔట్లకు సమీపం లోనే నూత న డంపింగ్ యార్డు ఏర్పాటుతో కోడూరు నుంచి నరసింహ పురం, విశ్వనాథపల్లి, పిట్టలంక, సాలెంపాలెం తదితర గ్రామాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్వచ్ఛ సంకల్పం పేరుతో, ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి పారిశుధ్యం పై పరిశుభ్రతపై ముందుకు వెళుతుంటే ఇక్కడ మాత్రం జంతువుల కళేబరాలు కూడా రోడ్డు పక్కన వేస్తుండడంపై గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వడ్డెర సంఘం నాయకులు కాశయ్య మృతి

ప్రజాశక్తి-సింగ్‌నగర్: 58వ డివిజన్ వడ్డెర సంఘం సీనియర్ నాయకులు గుంజ కాశయ్య శుక్రవారం తెల్లవారుజామున మరణించారు. విషయం తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు తదితరులు కాశయ్య భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాబూరావు మాట్లాడుతూ గుంజ కాశయ్య సింగ్‌నగర్ వడ్డెర సంఘానికి అధ్యక్షులుగా రెండు సార్లు పనిచేశారని తెలిపారు.



అనంత లక్ష్మికి నివాళి

ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం తోపుడు బండ్ల కార్మిక సంఘం (సిఐటియు) యూనియన్ ఉపాధ్యక్షురాలు అనంత లక్ష్మి అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో తోపుడు బండ్ల యూనియన్ స్థాపన కోసం ఆమె పోరాడారు. పోలీసు నిర్బంధాలు, హైవే అధికారుల ఒత్తిడులను తట్టుకొని యూనియన్ స్థాపనలో విశేష కృషి చేశారు. సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి ఎం.మహేష్, యూనియన్ అధ్యక్షురాలు బి రమణమ్మ, కార్యదర్శి మల్లేష్, ఉపాధ్యక్షులు నవీన్, దుర్గా, ప్రభుదాస్, నాయుడు, విజయ్, నాగమల్లి తదితరులు అనంత లక్ష్మికి నివాళులర్పించారు.



ప్రజ్ఞ వికాసం గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-మైలవరం: స్థానిక లక్కిరెడ్డి హనిమిరెడ్డి హైస్కూల్లో ఎస్‌ఎఫ్‌ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజ్ఞా వికాసం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు కుమార్‌నాయక్ మాట్లాడుతూ ఈ నెల 20న పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం పేరుతో మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ రుసుము రూ.25 చెల్లించాలని, పరీక్ష మధ్యాహ్నం 2 నుండి 3.30 గంటల వరకు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్, కె.వెంకయ్య, బి.సుభాష్ చంద్రబోస్, కె.శంకరరరావు, అజయ్‌కుమార్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజానుకూల విధానాల అమలుకు పోరాటం

దివాకర్ వర్ధంతి సభలో బాబూరావు


సభలో మాట్లాడుతున్న బాబూరావు

ప్రజాశక్తి-విజయవాడ: ప్రజానుకూల విధానాల అమలు కోసం పోరాడటమే దివాకర్‌కు అర్పించే నిజమైన నివాళి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. కార్మిక నేత, సిఐటియు నాయకులు, సిపిఎం నగర మాజీ కార్యదర్శి పి.దివాకర్ 19వ వర్ధంతి సభ శుక్రవారం స్థానిక కేదారేశ్వరపేట మ్యాంగో మార్కెట్లో జరిగింది. ముందుగా దివాకర్ చిత్రపటానికి బాబూరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు వేస్తున్నాయన్నారు. ప్రజా సంక్షేమానికి కేంద్ర బడ్జెట్లో కేటాయింపులు తగ్గించారని అన్నారు. కేంద్రంలోని మోడీ అడుగుజాడల్లో నడుస్తున్న సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నీటి మీటర్లు ,కరెంటు చార్జీలు, చెత్త పన్ను , ఆస్తి పన్ను లాంటి భారాలు మోపుతూ బటన్ నొక్కకుండానే మన జేబులు ఖాళీ చేస్తున్నారని విమర్శించారు. సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కార్మికులకు మేలు చేసే సంక్షేమ చట్టాలు తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాములు, సిఐటియు సెంట్రల్ సిటీ ప్రధాన కార్యదర్శి ఎంవి సుధాకర్, పశ్చిమ సిటీ అధ్యక్షులు వెంకట్రావు, సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు వై సుబ్బారావు, టి ప్రవీణ్, ఎం బాబురావు, సిహెచ్ మురళి, ఎంవి రమణ, టి ప్రభుదాసు, డాక్టర్ వామాక్షి రావు, దివాకర్ కుమారుడు పి.రాజేష్ పాల్గొన్నారు.

పశ్చిమలో ఏడు వేల సభ్యత్వం లక్ష్యం : పోతిన

ప్రజాశక్తి-భవానీపురం

పశ్చిమ నియోజకవర్గంలో 5 నుంచి 7 వేల సభ్యత్వాలు నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని జనసేన నగర అధ్యక్షులు పోతిన వెంకట మహేష్ చెప్పారు. శుక్రవారం సితార సెంటర్ వద్ద 45, 44 డివిజన్ అధ్యక్షులు బొమ్ము రాంబాబు, మల్లెపు విజయలక్ష్మి ఆధ్వర్యంలో జనసేన పార్టీ మూడో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు నెమళ్ళ సంజీవరావు, రావి సౌజన్య, స్టాలిన్ శంకర్, కొరగంజి రమణ, నల్లబెల్లి కనకారావు, పొట్నూరి శ్రీనివాసరావు, తిరుపతి అనూష, సాయి శరత్, తమ్మిన లీలా కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: రెడ్డిగూడెంలో మైలవరం నియోజకవర్గ ఇంచార్జ్ అక్కల రామ్మోహనరావు(గాంధీ) క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఈ నెల 28 వరకు జరుగుతుందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డిగూడెం మండల అధ్యక్షుడు చాపలమడుగు కాంతారావు, ఉపాధ్యక్షులు పాములపాటి సుందరరామిరెడ్డి, బొల్లిపోగు చంటి, మైలవరం మండల అధ్యక్షుడు శీలం బ్రహ్మయ్య పాల్గొన్నారు.


క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న వెలంపల్లి

క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి-వన్‌టౌన్: స్థానిక విద్యాధరపురం గుప్తా సెంటర్ వద్ద ఉన్న షాదిఖానా గ్రౌండ్‌లో శుక్రవారం నుండి పది రోజుల పాటు 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ అధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు, వైసీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు, నాయకులు పి.సుబ్బారెడ్డి, చిచ్చా పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

స్థానిక 43వ డివిజన్‌లో పలు అభివద్ధి కార్యక్రమాలకు శుక్రవారం వెలంపల్లి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మూడు కోట్ల రూపాయల నిధులతో పలు అభివద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. నిధులు లేకుండా అమరావతిని అభివృద్ధి పర్చలేమన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ కోటిరెడ్డి పాల్గొన్నారు.



చనమోలు వెంకట్రావు జయంతి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: నాటి తరం పెద్దమనిషిగా, నేటి తరానికి స్ఫూర్తిప్రదాతగా చనమోలు వెంకట్రావు ప్రసిద్ధికెక్కారని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ సమీపంలోని ఫెర్రి రోడ్డులో చనమోలు వెంకట్రావు 91వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇబ్రహీంపట్నం పెర్రీ రోడ్డులో కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో వెంకట్రావు జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్, చిలుకూరు గ్రామ సర్పంచి గొంది సురేశ్, జువ్వా వాసు తదితరులు పాల్గొన్నారు.

లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి-సింగ్‌నగర్: రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా మార్చి 3, 4 తేదీల్లో విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనములో సమ్మిట్ లోగోను ఆయన ఆవిష్కరించారు. వాస్తవిక పెట్టుబడులు లక్ష్యంగా సదస్సు జరగనుందని మల్లాది విష్ణు తెలిపారు. ఏపీలో అవకాశమున్న రంగాలలో పెట్టుబడులను ఆకర్షించేలా, అపార అవకాశాలను సమగ్రంగా వివరించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి 15 మంది కేంద్ర మంత్రులు, 15 మంది ముఖ్యమంత్రులు, 44 మంది ప్రపంచ పారిశ్రామికవేత్తలు, 53 మంది భారతీయ పరిశ్రమల ప్రముఖులు, వివిధ దేశాల రాయబారులను ఇప్పటికే ఆహ్వానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కమిటీ మెంబర్ ప్రభువికాస్ పాల్గొన్నారు.

కిక్కిరిసిన గుణదల



- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- నేడు మేరీమాత ఉత్సవాలు ముగింపు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: గుణదల మేరిమాత ఉత్సవాలలో భాగంగా రెండో రోజు శుక్రవారం పెద్ద సంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. దీంతో గుణదల పరిసర ప్రాంతాలన్నీ కిక్కిరిసిపోయాయి. తొలుత గుణదల పుణ్యక్షేత్రం వద్ద ఉత్సవాలను విజయవాడ బిషప్ జోసఫ్ రాజారావు ప్రారంభించారు. అనంతరం పుణ్యక్షేత్రం వద్ద నుండి మేరిమాత విగ్రహం వరకు వెళ్లి మేరిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయవాడ కతోలిక పీఠం మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ మాట్లాడుతూ 99 సంవత్సరాల గుణదల పుణ్యక్షేత్రం అభివృద్ధి వెనుక ఎంతో మంది బిషప్‌లు, గురువులు పాత్ర ఉందన్నారు. అనంతరం బిషప్ గ్రాసి పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పూజాపీఠంపై విజయవాడ కతోలిక పీఠం బిషప్ రాజారావు, ఫాదర్ గాబ్రియేలు, పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ పసల తోమస్ 70 మందికిపైగా గురువులు సమిష్టి దివ్య పూజాబలి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఖమ్మం బిషప్ పాల్‌మైపాన్ ప్రత్యే పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విజయమేరి, మడోన్న పాఠశాల చిన్నారులతో నిర్వహించిన నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. కళాదర్శిని నిర్వాహకులచే కల్వరి యాగం నృత్య రూపకం, గుణదల అశోక్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పునీత పాలు మనో పరివర్తన ఏకపాత్రాభినం విశేషంగా ఆకట్టుకున్నాయి. మేరిమాత ఉత్సవాలు శనివారంలో ముగియనున్నాయి.















నేటి నుంచి 'మానవత - నైతికత'పై రాష్ట్రవ్యాప్త జాగృతి ఉద్యమం

పెనమలూరు : జమాఅతె ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఈనెల 11 నుండి 20వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 'మానవత నైతికత' అనే నినాదంతో జాగృతి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉద్యమాన్ని నిర్వహిస్తున్నామని స్థానిక ఉద్యమ కన్వీనర్ అక్బర్ షరీఫ్ వెల్లడించారు. శుక్రవారం పట్టణంలో విజయవాడ నార్త్ శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక అధ్యక్షులు ముహమ్మద్ ఖలీలుల్లాహ్ మాట్లాడారు. నేడు మనిషి వైజ్ఞానిక అభివృద్ధిలో దూసుకుపోతున్నారన్నారు. కానీ మానవతా విలువలు నానాటికి దిగజారుతున్నాయన్నారు. సమాజం నిత్యం అశాంతికి, అలజడికి గురౌతోందన్నారు. సమాజంలో పెరిగిపోతున్న నేరాలు, మారణ హోమాలే ప్రత్యక్ష ఉదాహరణలని వివరించారు. మనిషిలో నైతిక పరివర్తన కలిగినపుడే మానవతా విలువలు వికసిస్తాయన్నారు. దైవభీతి, జవాబుదారీతనం వల్లనే మనిషిలో అవసరమైన మానవీయత, నైతికత జనిస్తాయన్నారు. ఈ సందర్భంగా ఉద్యమ పోస్టర్లు, స్టిక్కర్లను సంస్థ బాధ్యులు, సభ్యులు, కార్యకర్తల చేతుల మీదుగా ఆవిష్కరించారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో సన్మానం

ప్రజాశక్తి-నాగాయలంక

నాగాయలంక రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మండల శాఖ చైర్మన్ భోగాది శివ విష్ణువర్ధన్ అధ్యక్షతన ఖేలో ఇండియా వాటర్ స్పోర్ట్స్ విభాగంలో జాతీయస్థాయిలో సిల్వర్ మెడల్, నాలుగో స్థానం సాధించిన నాగిడి గాయత్రి, నాగిడి భార్గవిలతో పాటుగా క్రీడాకారులు అచ్యుత్ కుమార్, విష్ణువు, కోచ్‌లు టి.నాగబాబు, ఎం.శ్రీను, కె.బాబూరావు, జిల్లా క్రీడా అధికారి ఝాన్సీలక్ష్మిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి కృష్ణ ప్రసాద్, మండవ బాలవర్ధన్, బీసాబత్తుని ప్రసాద్, మునగాల కుటుంబరావు, రఘు శేఖర్, చిట్టా శేఖర్, జలూరి మురళి, విరాటి బలరామ్ తదితరులు పాల్గొన్నారు

శారీరక వికాసానికి క్రీడలు దోహదం

జడ్‌పి చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

ప్రజాశక్తి - మొవ్వ

శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదపడతాయని కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికారాము అన్నారు. మొవ్వ డిగ్రీ కళాశాలలో భూమి



బహుమతులను అందజేస్తున్న ఉప్పాల హారిక

ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన యువజనోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికా రాము, పామర్రు ఎంఎల్‌ఎ కైలే అనిల్ కుమార్‌లకు కళాశాల ఎన్‌సిసి కేడెట్లు గౌరవ వందనంతో సాధర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కళాశాల భోధన, భోధనేతర సిబ్బంది, నిర్వాహకులు, పలువురు అధికార, అనధికార ప్రముఖులు పాల్గొన్నారు.

నేడు, రేపు బిల్లుల చెల్లింపునకు అవకాశం

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

మచిలీపట్నం డివిజనులోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు, విద్యుత్ బిల్లులు వసూలు కేంద్రాల్లో శని, ఆదివారాల్లో యథావిధిగా పని చేస్తాయని మచిలీపట్నం విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ ఎం.భాస్కరరావు తెలిపారు.

వైసిపి పాలనపై ప్రజల్లో అసంతృప్తి : టిడిపి

ప్రజాశక్తి-తోట్లవల్లూరు

మండల కేంద్రమైన తోట్లవల్లూరులో శుక్రవారం 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' నిరసన కార్యక్రమం టిడిపి ఆధ్వర్యంలో జరిగింది. మండల పార్టీ అధ్యక్షులు వీరపనేని శివరాం ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి వర్ల కుమార్ రాజా ముఖ్యఅతిథిగా విచ్చేశారు. గ్రామంలో రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అక్రమ ఇసుక విధానం,విద్యుత్ ఛార్జీలు పెంపు వంటి అనేక సమస్యల గురించి ప్రజలకు వివరించారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి, బిసి విభాగం జిల్లా ఉపాధ్యక్షులు పిట్టు వెంకటేశ్వరావు, నియోజకవర్గ బీసీ విభాగం అధ్యక్షులు వీరంకి పరుశురాం,మండల తెలుగుదేశం నాయకులు చెన్నుపాటి శ్రీధర్, నక్కలపూడి మురళి, కళ్ళం వంశీకృష్ణారెడ్డి, వల్లూరు రాంబాబు, గొరిపర్తి పోతురాజు,తోట సాయి,



ఉంగుటూరు మండలంలో

గొరిపర్తి శ్రీనివాసరావు, ఈడ్పుగంటి సుధాకర్, డొక్కు శివశంకర్, ఎండి దౌల, వల్లూరు కుమార్,బొడ్డు సుగుణాకర రావు, వల్లూరు సుదర్శన్, ఈడే వాసు, ఉప్పులూరి గోపాలకష్ణ, రామకష్ణారెడ్డి,పందు రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, కోటిరెడ్డి, వీరంకి నాగార్జున, వీరంకి కష్ణ,దేవరపల్లి అనిల్, గోరిపర్తి సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : ఉంగుటూరు మండలంలోని



తోట్లవల్లూరు మండలంలో

మధిరపాడు, గారపాడు గ్రామాల్లో టిడిపి మండల కమిటీ ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి నిర్వహించారు. గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు వద్రాణం హరిబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల కాలంలో వైసిపికి చెందిన ఎమ్మెల్యేలు అసంతృప్తితో బయటకు వస్తున్నారన్నారు. 14 అంశాలపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఉంగుటూరు మండల అధ్యక్షులు ఆరుమళ్ళ కృష్ణారెడ్డి, గన్నవరం మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు తుమ్మల రామకృష్ణ, గారపాడు గ్రామ అధ్యక్షుడు కుమ్మరి వెంకటేశ్వరరావు, యూనిట్ ఇంఛార్చ్ కొలవెంటి నాగబాబు, తెలి సత్యనారాయణ, ఎనికేపల్లి ఏడుకొండలు, చింతయ్య, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని తరగతుల ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత : కైలే



బుక్‌లెట్లు అంజేస్తున్న కైలే అనిల్

ప్రజాశక్తి-పమిడిముక్కల

రాష్ట్రంలోని అన్ని తరగతుల ప్రజల సంక్షేమానికి రాష్ట్రంలోని వైసిసి ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తోందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. పమిడిముక్కల మండలంలోని అలీనాకిపాలెంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారంనాడు ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి వివరించారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నవరత్న పథకాల ద్వారా అన్ని తరగతుల ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగు వెంకటరమణకుమారి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, మీర్జా దినాయత్ ఆలీ, వైసిపి పమిడిముక్కల మండల అధ్యక్షులు యలమంచిలి గణేష్, లంకపల్లి ఎంపిటిసి సజాద్ ఆలీ, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంబపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వేణుగోపాల్

గన్నవరం : కుష్ఠు వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కుష్ఠునివారణ కేంద్రం అధికారి డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం గన్నవరం వి కే ఆర్ కళాశాలలో స్పర్శ లెప్రసీ అవగాహన కార్యక్రమం 2023లో భాగంగా లెప్రా ఆధ్వర్యంలో కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు జరిగింది. వికేఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి అంటువ్యాధి కాదన్నారు. ఆ రోగులను హీనంగా చూడకూడదనానరు. శరీరంపై మచ్చలు వస్తే కుష్ఠు రోగంగా నిర్ధారణ చేసుకోవడానికి వైద్యులను సంప్రదించాలన్నారు. కంటి రెప్పలపై వెంట్రుకలు రాలిపోవడం, చెవులపై కణుతులు రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే కుష్ఠు వ్యాధి డాక్టర్ల వద్దకు వెళ్లాలన్నారు. మనిషి శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గితే రోగాలు వస్తాయన్నారు. కుష్టు రోగాన్ని ప్రారంభంలో గుర్తిస్తే తగ్గించేందుకు చర్యలు తీసుకోవచ్చునన్నారు. విద్యార్థులు ఈ వ్యాధిపై అవగాహన కలిగి ఉండడం మంచిదన్నారు. జిల్లాలో కుష్టు రోగుల సంఖ్యను తగ్గించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఒ వెంకట్ రాజు, ఎంఒ మాధవి, సిబ్బంది భాస్కర్‌బాబు, శ్రీలక్ష్మి, నాంచారమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రథమంగా నిలపాలి : బండి

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ మండలంలో 10 వేల క్రియాశీల సభ్యులుగా చేర్చి రాష్ట్రంలో మొదటి స్థానం సాధించాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ పిలుపునిచ్చారు. మూడో విడత సభ్యత నమోదు కార్యక్రమాన్ని అవనిగడ్డలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. జనసేన పార్టీకి అవనిగడ్డ గుండె లాంటిదన్నారు.



సభ్యత్వ నమోదు పత్రాన్ని అందజేస్తున్న బండ్రెడ్డి రామకృష్ణ తదితరులు

పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పోటీ చేస్తే ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపించాలని కోరారు. పార్టీ కోసం పని చేస్తూ ఇప్పటివరకు ప్రమాదాల్లో చనిపోయిన 96 కుటుంబాలకు రూ4.80 కోట్లు గాయపడిన 169 మందికి రూ.86 లక్షలు వరకు అందించినట్లు తెలిపారు. క్రియాశీల సభ్యత్వం కోసం రూ. 500 చెల్లిస్తే పార్టీ అధ్యక్షులు రూ.1500 చెల్లిస్తారని తెలిపారు. చెన్నగిరి దుర్గా ఝాన్సీ లక్ష్మికి సభ్యత్వం ఇవ్వగా పప్పుశెట్టి శీను మొదటి రెన్యూవల్ చేయించారు. సీనియర్ నాయకులు చెన్నగిరి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్మాన్ షరీఫ్, పార్టీ అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, మండలాల అధ్యక్షులు గుడివాడ శేషుబాబు, చింత వెంకటేశ్వరరావు, పూసదపు అంకినీడు, విమల్ కృష్ణ, మర్రే గంగయ్య, నాయకులు పంచకర్ల సురేష్, రవి వర్మ, ఎంపీటీసీ సభ్యులు బొప్పన భాను తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

శనివారం ఉదయం 8 నుండి 11 గంటల వరకు గుడ్లవల్లేరు మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ఎఇఇ కె.సుబ్బారెడ్డి తెలిపారు. మెయింటెనెన్స్ నిమిత్తం నిలుపుదల చేస్తున్నామనీ, వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

అంకమ్మతల్లి ఆలయ వార్షిక మహోత్సవం

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: మండల కేంద్రమైన రెడ్డిగూడెంలో అంకమ్మ తల్లి ఆలయ ఆరో వార్షిక మహోత్సవ పూజలు అత్యంత వైభవోపేతంగా భక్తిశ్రద్ధలతో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతలపాటి పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో , వేద పండితులు వెంకటేశ్వర శర్మ సుబ్రహ్మణ్య శాస్త్రి కిరణ్ శాస్త్రి. తో వేదమంత్రాచారణ నడుమ అశేష భక్తజన సందోహంతో.శ్రీమహావిద్య, ధన్వంతరి హెూమాలు. ఆశ్లేష బలి, అమ్మవారికి పంచామతాలతో అభిషేకాలు, తో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు చుట్టుపక్కల నుంచి గ్రామాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు దర్శించుకున్న వారిలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల రామ్మోహన్రావు గాంధీ, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు కే విజయబాబు, మండల టిడిపి అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కుప్పిరెడ్డి వరప్రసాద్ రెడ్డి, ఉయ్యూరు భరత్ కుమార్ రెడ్డి, జిల్లా తెలుగు యువత నాయకులు పి కిరణ్ కుమార్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.


ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు

ప్రజాశక్తి-విజయవాడరూరల్: మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నున్న లో రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం జరిగింది. వ్యవసాయ సలహా మండలి కమిటీ చైర్మన్ యర్కా రెడ్డి నాగిరెడ్డి మాట్లాడుతూ ఈ రబీ సీజన్ లో వరి, తెల్లజొన్న, మొక్కజొన్న రైతులు సాగు చేస్తున్నారని అన్నారు.వీటికి సంబందించిన ఎరువులు, అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, యూరియాకు కొరత లేకుండా చూడాలని పలువురు సభ్యులు కోరారు. రబీ సీజనకు రైతులందరు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని, తద్వారా పథకాలు లబ్దిపొందాలని తెలియచేశారు. వ్యవసాయ అధికారి బి. రంగనాథ్ బాబు మాట్లాడుతూ "అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023" సందర్భంగా రైతులందరు చిరుధాన్యాలు జొన్న, మొక్కజొన్న, రాగులు మొదలగు పంటలను సాగుచేయాలని తద్వారా ఆరోగ్యం పెంపొందించుకోవాలని సూచించారు.

కళ్యాణమస్తు, షాదీ తోఫా జమ

- మొత్తం 2,57,50,000
- కృష్ణాజిల్లాలో 1,24,95,000
- ఎన్‌టిఆర్ జిల్లాలో 1,32,55,000

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా), విజయవాడ : ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీ తోఫాను శుక్రవారం లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా జిల్లాల అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కృష్ణాజిల్లాలో 140 మంది జంటలకు వైయస్సార్ కళ్యాణమస్తు, వైయస్సార్ షాదీ తోఫా కింద కోటీ 24 లక్షల 95 వేల రూపాయలను నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి జమైనట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. వైఎస్సార్ కళ్యాణ మస్తు వైఎస్సార్ షాదీ తోఫా పథకం ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం



శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఆయన తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున మొదటి విడతగా 4,536 జంటల ఖాతాల్లో రూ. 38 కోట్ల 18 లక్షల నగదు జమ చేశారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం నగర పాలక సంస్థ మేయర్ మోక వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ కంటిపూడి కవితా థామస్ నోబుల్, మచిలీపట్నం మాజీ మున్సిపల్ ఛైర్మన్ షేక్ సలార్ దాదా, ముడా ఛైర్మన్ బొర్రా దుర్గా నాగలక్ష్మి భవాని విఠల్, మచిలీపట్నం మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ షేక్ ముస్తఫా (అచ్చుబా), డి ఆర్ డి ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్, మెప్మా పీడీ పీ.ఎస్. ప్రసాద్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిణి షంసున్నీసా బేగం, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ, సాధికారిత అధికారిణి కె. సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పేద వర్గాలకు ప్రోత్సాహం : జెసి నుపూర్ అజయ్

పేద వర్గాలకు చెందిన యువతను విద్యలో ప్రోత్సహించడంతోపాటు బాల్య వివాహాలను నివారించేందుకు ప్రభుత్వం వైయస్సార్ కళ్యాణమస్తు, వైయస్సార్ షాదీ తోఫా పథకాలు ఎంతో దోహదపడతాయని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. నుపూర్ అజయ్ అన్నారు. వైయస్సార్ కళ్యాణమస్తు, వైయస్సార్ షాదీ తోఫా ద్వారా జిల్లాలో 147 మంది



లబ్ధిదారులకు కోటీ 32 లక్షల 55 వేల రూపాయల లబ్ధిని ఆయా లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారు. విజయవాడలో కలెక్టరేట్ వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్‌నుపూర్ అజయ్, స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులతో కలిసి వీక్షించారు. అనంతరం లబ్ధిదారులకు ఆర్థిక సహాయపు చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మట్లాడుతూ 2022 అక్టోబర్ నుండి డిసెంబర్ మధ్య త్రైమాసికంలో వివాహం చేసుకున్న వారికి వీటి ద్వారా లబ్ధిచేకూర్చారు. వివాహమైన వారు 30 రోజుల్లోగా పథకానికి దరఖాస్తు చేసుకుంటే అర్హతను గుర్తించి పథకాన్ని మంజూరు చేస్తారన్నారు. శాసనసభ్యులు మల్లాదివిష్ణువర్ధన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టి భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లో ఆడపిల్లల పెళ్లిళ్లు నిరుపేదలైన తల్లిదండ్రులకు భారం కాకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఈ పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. ఈకార్యక్రమంలో కాపు కార్పొరేషన్ ఛైర్మన్ అడప శేషగిరి, విశ్వబ్రహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ టి. శ్రీకాంత్, డిఆర్‌డిఏ పిడి శ్రీనివాస్, సోషల్ వెల్ఫేర్ డిడి బి.వి.విజయభారతి పాల్గొన్నారు.



ఎఫ్ఆర్ఎస్ నుండి జిజిహెచ్ పారిశుధ్య కార్మికులను మినహాయించండి

డిఆర్‌ఒకు యూనియన్ నేతల వినతి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఎపి మెడికల్, హెల్త్ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) విజయవాడ ప్రభుత్వాస్పత్రి కార్మికులకు ఎఫ్ఆర్ఎస్ మినహాయింపు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం ఎన్‌టిఆర్ జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్‌ఒ) కె.మోహన్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మోహన్ కుమార్ మాట్లాడుతూ జిజిహెచ్ కార్మికుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని అన్నారు. థర్డ్ పార్టీలో పనిచేస్తున్న చిరుద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏమీపోవని, అనవసరమైన అపోహలకు పోవద్దని అన్నారు. ఈ సందరక్భంగా సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ విజయవాడ కొత్త ప్రభుత్వాస్పత్రి (జిజిహెచ్)లో 15 ఏళ్లుగా పనిచేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ గార్డులు విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం ఎజిల్ గ్రూప్ సెక్యూరిటీ సర్వీస్ ఫోర్స్ అండ్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ థర్డ్ పార్టీ పద్ధతిలో వీరు పనిచేస్తున్నారని, కానీ కొత్తగా కార్మికులకు ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) హాజరు ప్రవేశపెట్టడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు దూరమవుతామన్న ఆందోళనలో కార్మికులు ఉన్నారని అన్నారు. అందువల్ల థర్డ్ పార్టీ చిరుద్యోగులను ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో యూనియన్ నగర నాయకులు వి.బి.రాజు, పారిశుధ్య కార్మిక నాయకులు టి.తిరుపతమ్మ, రేష్మ, మంగమ్మ, ఆషా హనీ పాల్గొన్నారు.

తాడిగడప మున్సిపల్ కార్మికుల సమస్యలపై స్పందించండి

యూనియన్ నాయకులు సరళ, రత్నకరుణ

పెనమలూరు : వైఎస్ఆర్ తాడిగడప మున్సిపల్ కార్మికుల సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు యనమల సరళ, స్వప్న రత్నకరుణ డిమాండ్ చేశారు. పోరంకిలోని కామ్రేడ్ మానికొండ సుబ్బారావు, సూర్యవతి కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ తాడిగడప మున్సిపాలిటీగా ఏర్పడి మూడేళ్ల దాటుతున్నా ఇంతవరకు మున్సిపల్ జీతాలు అమలు చేయడంలేదని విమర్శించారు. వర్కర్లకు రెండేళ్లకొకసారి ఇస్తామన్న యూనిఫారం, చెప్పులు, కొబ్బరినూనె స్థానిక ఎంఎల్‌ఎ పార్థసారథి సమక్షంలో ఇస్తామని హామీ ఇచ్చినా ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు కూడా ఇంతవరకు ఇవ్వలేదన్నారు. పోరంకిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులు సుమారు పదిమందిని అధికారులు తమ ఇళ్లల్లో పనులు చేయడానికి అధికారులే డబ్బులిచ్చి పంపుతున్నారని అన్నారు. ఈ సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తుంటే చిన్నచిన్న తప్పులను అడ్డుపెట్టుకుని కార్మికులను వారం పదిరోజులపాటు సస్పెన్షన్ పేరుతో ఆపేస్తున్నారని అన్నారు. అలాగే స్థానిక వైసిపి నాయకుల ఒత్తిళ్లతో వాళ్ల చెప్పినట్లు కమిషనర్ చేయిస్తున్నారని వాపోయారు. ఇదే వైసిపి నాయకులు గతంలో కార్మికును నోటికొచ్చినట్లు మాట్లాడి చేయి కూడా చేసుకోబోయారని గుర్తుచేశారు. అలాగే గతంలో పోరంకి, ఇప్పుడు తాడిగడప చెత్త డంపింగ్ యార్డ్‌లో యానాది కుటుంబాల వారు పాత సామాన్లు సేకరించుకునే వారని, ఇప్పుడు వారిని రానీయకుండా మున్సిపల్ కార్మికులతోనే ప్లాస్టిక్ డబ్బాలు, రద్దు సామాన్లు ఏరించి శ్రీకాంత్ అనే మేస్త్రితో అమ్మకానికి తీసుకెళ్తున్నారని వివరించారు.





మహిళా ఫెస్ట్ ఛాంప్స్‌కు సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపల్ అభినందన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఈనెల 8, 9 తేదీల్లో విజయవాడ పిబి సిద్ధార్థ ఆడిటోరియంలో తరుణీ తరంగాలు ఆధ్వర్యాన జరిగిన మహిళా ఫెస్ట్ - 2023లో



శ్రీమతి వెలగపూడి దుర్గాంబ సిద్ధార్థ న్యాయ కళాశాల విద్యార్థినులు వివిధ రంగాల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో మొత్తం 24 బహుమతులతో అగ్రగామిగా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.దివాకర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కువ బహుమతులు గెలుచుకుని కళాశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చిన విద్యార్థులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ఆయన అభినందించారు.

జాతీయ రహదారి, రైల్వే ప్రాజెక్టుల పెండింగ్ పనులు పూర్తి : .జెసి

ప్రజాశక్తి - విజయవాడ : గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి, రైల్వే ప్రాజెక్టు అభివృద్ధికి సంబంధించి పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి, రైల్వే ప్రాజెక్టు, ఆర్అండ్‌బి రహదార్ల నిర్మాణ అభివృద్ధి పనులపై స్థానిక పింగళివెంకయ్య సమావేశ మందిరంలో రెవెన్యూ, నేషనల్ హైవే అధికారులతో ఆమె శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముస్తాబాద నుండి రాయనపాడు స్టేషన్ మధ్య విజయవాడ రూరల్ గొల్లపూడి–జక్కంపూడి రైల్ ఓవర్ రైల్ ప్రాజెక్టుకు సంబంధించిన మూడవ లైన్ ఓవర్ రైల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి అవసరమైన సబ్ డివిజన్ రికార్డును సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇబ్రహీంటప్నం – పవిత్ర సంగమం ఆర్అండ్‌బి రహదారికి సంబంధించి అభ్యర్థన పత్రాన్ని త్వరితగతిన సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గుణదల రైల్వే డబ్లింగ్ లైన్ విస్తరణకు సంబంధించి భూ సేకరణకు భూముల విలువలను నిర్ధారించి నివేధికను సమర్పించాలని స్థానిక తహాశీల్దార్‌ను ఆదేశించారు. విజయవాడ – ఖమ్మం గ్రీన్ ఫ్రీల్డ్ జాతీయ రహదారిలో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్‌హెచ్ 65 జాతీయ రహదారిలో కంచికచర్ల మండలం పరిటాల వద్ద రెండు లైన్ల బైపాస్ రోడ్డును ఆరు లైన్ల విస్తరణలో భాగంగా అవసరమైన మార్కెట్ వాల్యూ ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. ఈసమావేశంలో డిఆర్‌వో కె. మోహన్ కుమార్, నందిగామ ఆర్‌డివో ఆర్. రవీంద్రరావు, తిరువూరు ఆర్‌డివో వై వి.ప్రసన్నలక్ష్మి, ఏడి సర్వే కె.సూర్యారావు, సంబంధిత మండల తహాశీల్దార్లు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ : విజయవాడ టౌన్ డివిజన్ పరిధిలోని అజిత్‌సింగ్ నగర్ సెక్షన్లో శుక్రవారం విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ అధికారులు 44 బందాలుగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 159 కేసులు నమోదుచేసి రూ.4.66 లక్షల అపరాధ రుసుం విధించారు. వీటిలో అధికంగా వాడుకుంటున్న విద్యుత్ లోడ్ గుర్తించి క్రమబద్ధీకరించుకునేందుకు నోటీసులు జారీచేశారు. ఈదాడుల్లో టౌన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వి.సుధాకర్, విజిలెన్స్ ఏడిఈ బి.నవీన్ కుమార్, డి4 ఇన్చారిజ ఏడిఈ కె.నాగ సాయి, అజిత్‌సింగ్ నగర్ ఏఈ డి.కిరణ్ కుమార్, విజిలెన్స్ ఏఈ లు, టౌన్ డివిజన్ ఏడిఈ లు, ఏఈలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - విజయవాడ : ఈనెల 11వ తేదీ ఉదయం 8 నుండి 10 గంటల వరకు గవర్నర్‌పేట సెక్షన్, 11కెవి అప్సర ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటినెన్స్ నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిసిపిడిసిఎల్ విజయవాడ టౌన్ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.వి.సుధాకర్ తెలిపారు. రాజగోపాలాచారి రోడ్, బీసెంట్ రోడ్డు, ఫిష్ మార్కెట్ ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కేంద బడ్జెట్‌పై సిపిఐ నిరసన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యాన శుక్రవారం విజయవాడ కాళేశ్వరరావు మార్కెట్ హెడ్ పోస్టాఫీసు వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ ప్రజలకు ఏమాత్రం ఆమోదయోగ్యంగా లేదన్నారు. బడ్జెట్లో సామాన్యులు, రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. బిజెపి నేతలు స్పహలేక బడ్జెట్ అద్భుతమంటూ మాట్లాడుతున్నారని విమర్శించారు. కేంద్రప్రభుత్వం అదానీకి కొమ్ముకాస్తోందన్నారు. అదానీ అవకతవకలపై ప్రధాని మోడీ, అమిత్ షా ఎందుకు నోరు మెదపడంలేదన్నారు. కేంద్రం తీరు మార్చుకోకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లయోలా విద్యార్థులకు సిపిఆర్‌పై శిక్షణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, యన్‌టిఆర్ జిల్లా వారు స్థానిక ఆంధ్ర లయోలా కళాశాల విద్యార్థులకు సిపిఆర్‌పై శుక్రవారం కళాశాల ఆవరణలో శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఐఆర్‌సిఎస్ ఛైర్మెన్ డాక్టర్ జి.సమరం మాట్లాడుతూ జిల్లాలోని కళాశాలలో ప్రతీ ఒక్క విద్యార్థి సిపిఆర్‌పై అవగాహన కలిగి ఉండాలన్న ఉద్దేశంతో ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎడ్యుకేషన్ టూర్‌లో భాగంగా బెంజ్ సర్కిల్, నాస్కిక్ కేంద్రంలో ఉన్న బాపు దర్శన్, గోరా సైన్స్ సెంటర్, డాక్టర్ సమరం ఆసుపత్రిలో ఉన్న హెల్త్‌సెంటర్ ఎగ్జిబిషన్‌ను విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఏపి కిషోర్ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణా కార్యక్రమాల వల్ల విద్యార్థులకు ఆరోగ్య విషయాలపై అవగాహన పెరుగుతుందని, సమాజానికి కూడా మేలు జరుగుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో నియంత గోరా, డైరెక్టర్, గోరా సైన్స్ సెంటర్, డాక్టర్ వైవి ప్రభు, వైస్ ప్రిన్సిపాల్, యన్ యస్ యస్ సిబ్బంది డాక్టర్ ఎ శామ్యూల్ దయాకర్, డాక్టర్ సురేష్, డాక్టర్ ఆర్ జాన్ పాల్గొన్నారు.

సాయిల్ టెస్ట్ పనుల పరిశీలన

ప్రజాశక్తి-నాగాయలంక

నాగాయలంక మండలం ఏటిమొగలో కృష్ణానది వద్ద సాయిల్ టెస్ట్ పనులను అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శుక్రవారం పరిశీలించారు. ఎదురుమొండి బ్రిడ్జి నిర్మాణానికి ఎంపీ వల్లభనేని బాలశౌరి నాబార్డ్ నిధులు మంజూరు చేయించారని తెలిపారు. త్వరలో శంకుస్థాపన చేసి,2024 ఎన్నికల్లోపే నిర్మాణం పూర్తి చేద్దామనే నమ్మకంతో పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ వంతెన నిర్మాణం విషయంలో ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలు అవాస్తమని ఖండించారు. బ్రిడ్జి నిర్మాణానికి అంచనాలు పెరిగినా నిధులు తెస్తామని, ప్రజలకిచ్చిన హామీ నిలబట్టుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు,ఇరిగేషన్ డిఈ, ఆర్‌వి కన్సల్టెంట్ సిబ్బంది, నాగాలంక జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, మండల వైసిపి కన్వీనర్ భోగాది వెంకట శేషగిరిరావు, మాజీ జెడ్పీటీసీ కన్నా నాగరాజు, ఎదురుమొండి, నాచుకుంట, ఎలిచెట్లదెబ్బ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

12న మెగా జాబ్ మేళా

గుడివాడ : నిరుద్యోగ రహిత గుడివాడను చూడడమే ప్రధాన లక్ష్యంగా వెనిగండ్ల ఫౌండేషన్ ద్వారా ఎన్ఆర్ఐ వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని వెనిగండ్ల ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వికెఆర్ అండ్ వి.ఎన్.బి పాలిటెక్నిక్ కళాశాలలో ఉదయం 9 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు 25పైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. 18 నుండి 28 సంవత్సరాలలోపు పది నుంచి ఇంటర్, పాలిటెక్నిక్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులందరూ ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు.

గుడివాడలో స్పోర్ట్స్ మీట్

గుడివాడ : కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పొట్టి శ్రీరాములు ఉన్నత పాఠశాలలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ నిర్వహించారు. బాయ్స్ కబడ్డీ, ఖోఖో గర్ల్స్, ఖోఖో రన్నింగ్ ఆటలు పోటీలు నిర్వహించారు. టీఎంఇ రాణి, స్కూల్ ప్రిన్సిపాల్ జాన్ విక్టర్, నందివాడ ఎంపీపీ ఆదాం, నెహ్రూ యువకేంద్రం అధికారి సుంకర రాము, వి.రాజేష్, పోగ్రాం కోఆర్డినేటర్ వినోద్‌కుమార్, కాలేజీ పిఇటిలు మడక ప్రసాద్, కె.అనురాధ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

అతిగా మందుల వాడకం అనర్థదాయకం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

పంటల సాగులో అతిగా పురుగు మందుల వాడకం అనర్థదాయకమని మండల వ్యవసాయ అధికార జి.వి.శివప్రసాద్ అన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు జన్ను రాఘవరావు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు జి.చూడామణి అధ్యక్షతన చిన్నాపురం గ్రామంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం జరిగింది. అనంతరం రైతులతో కలిసి పొలాన్ని పరిశీలించారు. పురుగు వున్నా లేకపోయినా ఎక్కువగా పురుగుమందులు పిచికారీ చేయటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.గోపాలరావు, పార్టీ ఇంచార్జ్ జంపాన సుబ్రహ్మణ్యం, రైతులు పాల్గొన్నారు.

టీచర్స్ సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవం

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ ది మండల పరిషత్ టీచర్స్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఏడుగురు పాలకవర్గ స్థానాలకు శుక్రవారం నామినేషన్ వేయాల్సివుండగా సహకార శాఖ సబ్ రిజిస్ట్రార్ కె.లీల ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నామినేషన్లు స్వీకరించారు. పిఆర్‌టియుకు చెందిన ఏడుగురు సభ్యులు మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. జీవీఎస్ పెరుమాళ్ళు, లంకె వెంకటేశ్వరరావు, నరహరిశెట్టి అనిత, సూరగం వెంకట సూరయ్య, వెంకటరత్నరావు, మన్నే ప్రేమ చందు, ఉద్దంటి వీర వెంకట ప్రసాద్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి లీల ప్రకటించారు. అధ్యక్ష , ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారులను ఈనెల 13న సంఘ కార్యాలయంలో ఎన్నుకోవాల్సివుందని లీల తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ టి.కల్పలత, పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు డి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జమలపూర్ణమ్మ

బడ్జెట్లో అభివృద్ధికి రూ.13.64 కోట్లు

కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను గ్రంథాలయాల అభివృద్ధికి రూ.13.64 కోట్లతో కష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్ ఆమోదించింది. కష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య బడ్జెట్ సమావేశం శుక్రవారం జిల్లా గ్రంథాలయంలో చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమల పూర్ణమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికిగాను రూ.13.64 కోట్లతో బడ్జెట్ ఆమోదించగా దీనిలో గ్రంథాలయ భవనాల నిర్మాణం, పుస్తకాల కొనుగోలు, నిర్వహణ ఖర్చుల కోసం రూ.7.50 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. సెస్ రూపంలో ఈ ఏడాది ఇప్పటి దాకా రూ.4 కోట్లు, వచ్చిందన్నారు. మరో రూ.4 కోట్లు వరకూ వచ్చే అవకాశం ఉందన్నారు. గ్రంథాలయాల అభివృద్ధి సెస్ విధులతోనే సాధ్యమన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థకు రావాల్సిన సెస్ బకాయిలు విడుదల చేయాలని కృష్ణా, ఎన్టీఆర్ విజయవాడ జిల్లాల కలెక్టర్లకు లేఖలు రాశామన్నారు. అందరి తోడ్పాటుతో వచ్చే ఏడాది సెస్ నిధులు రూ.10 కోట్లు వరకూ వస్తాయని ఆశిస్తున్నామన్నారు. కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.రవి కుమార్ మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో పాఠకుల కోరిక మేరకు పుస్తక పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. లైబ్రరీ కేటలాగ్ ఆధునీకరిస్తున్నామన్నారు. ఏ పుస్తకం ఎవరు తీసుకువెళ్లారు, ఏ పుస్తకం ఏ రాక్లో వుందో కూడా తెలుసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో డిపిఒ నాగేశ్వరనాయక్, డిడి వయోజన విద్య మొహమ్మద్ హాజీబేగ్, ఎంఇఒ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూలి రేట్ల పెంపును అమలు చేయాలి : సిఐటియు

కలెక్టరేట్ (కృష్ణా) : పౌరసరఫరాల సంస్థ హమాలీలకు ప్రభుత్వం పెంచిన కూలీరేట్లను వెంటనే అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న ఎరియర్స్ బిల్స్ చెల్లించాలని ఎపి పౌరసరఫరాల సంస్థ కృష్ణాజిల్లా గౌరవ అధ్యక్షులు బూర సుబ్రహ్మణ్యం అధికారులను కోరారు. ఎపి పౌరసరఫరాల సంస్థ హమాలీల యూనియన్ కృష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏపీ పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ డాక్టర్ ఏ. శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. కూలీ రేట్లు జీవో 3 ప్రకారం క్వింటాకి రూ.19 నుంచి రూ.22 వరకు ప్రభుత్వం పెంచిన ప్రకారం కూలి రేట్లు పెంచాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందించిన వారిలో యూనియన్ జిల్లా కార్యదర్శి జే నాగ శివ మచిలీపట్నం ఎం ఎల్ ఎస్ పాయింట్ యూనియన్ నాయకులు జి వెంకటేశ్వరరావు, సిఐటియు మచిలీపట్నం నగర కార్యదర్శి సిహెచ్ జయరావు ఉన్నారు.



శ్రీధర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ప్రజావరాలకే ప్రభుత్వ స్థలాన్ని వినియోగించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

నగర నడిబొడ్డున విలువైన ప్రభుత్వ భూమిలో వైసీపీ జిల్లా కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించటాన్ని సిపిఎం మచిలీపట్నం నగర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోని, ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రజల అవసరాలకు వినియోగించాలని సిపిఎం నగర కార్యదర్శి బూర.సుబ్రహ్మణ్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ ఆనాటి నుండి ఎమ్మెల్యేలకు, ప్రజా ప్రతినిధులకు ఇళ్ల స్థలాల కేటాయింపును కూడా వ్యతిరేకిస్తోందన్నారు. ఆ భూములను లేని పేద ప్రజలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరిన విషయాన్ని గుర్తుచేశారు. నేడు అధికారాన్ని అడ్డం పెట్టుకుని విలువైన ఆస్తులను ప్రజల అవసరాలకు ఉపయోగించకుండా పార్టీ కార్యాలయాలకు కేటాయించటం సరైన పద్ధతి కాదన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ రాజేష్ మాట్లాడుతూ మచిలీపట్నం కార్పొరేషన్ పరిధిలో ప్రజల ఆస్తులను ప్రభుత్వం కాపాడాలన్నారు. ఆ ఆస్తులను ప్రజల అవసరాలకు ఉపయోగించాలనీ, మచిలీపట్నం నగరంలో ఎస్సీ, ఎస్టీ పేదలకు ఉన్నత ఉన్నత ఉద్యోగాలకు స్టడీ సర్కిల్ లాంటిది ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లాలో అనేక గ్రామాల్లో కనీసం శవాలను కాల్చడానికి శ్మశానాలు కూడా లేని పరిస్థితి ఉందన్నారు. అలాంటి సమస్యలపై ప్రభుత్వం పని చేయాలని హితవు పలికారు . ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు సిహెచ్ జయరావు, ఎండి యూనస్, నాయకులు ఈడే రామారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

త్వరలో జర్నలిజంలో డిప్లమో కోర్సు

ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

కృష్ణా యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఎం.రామిరెడ్డితో ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు శుక్రవారం సమావేశమయ్యారు. నూతనంగా ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి జర్నలిస్టుల కోసం ప్రారంభిస్తున్న డిప్లొమా ఇన్ జర్నలిజం కోర్సుకు సంబంధించిన తదితర విషయాలపై యూనివర్సిటీ రిజిస్ట్రార్‌తో చర్చించారు. త్వరలోనే కృష్ణా యూనివర్శిటీతో ఒప్పందం కుదుర్చుకొని జర్నలిస్టులు, జర్నలిజంపై ఆసక్తి వున్న వారి కోసం ప్రెస్ అకాడమీ డిప్లొమా కోర్సును ప్రకటించనున్నట్లు ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. ప్రెస్ అకాడమి సెక్రటరీ మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

జనసేన పార్టీ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మచిలీపట్నంలోని కార్యాలయంలో జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ క్రియాశీలక మూడో విడత సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10 నుంచి నుండి 28 వరకు క్రియాశీలక సభ్యత్వ నమోదును చేపట్టామన్నారు. 18 నుంచి 70 సంవత్సరాలు ఉన్న వారికి సభ్యత్వ నమోదుతో పాటు బీమా సౌకర్యం కూడా ఉందన్నారు. ప్రమాద భారిన పడి గాయాలైన వారికి రూ.50 వేలు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారికి రూ.5లక్షల బీమా సౌకర్యం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు, నెలకుర్రు సర్పంచ్ బొమ్మసాని నరేష్, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సమీర్, డివిజన్ ఇంచార్జు కర్రి మహేష్,కొండ,గుణ్ణంవాసు, గంపలకష్ణ,వివేక్,యశ్వంత్, రాజేష్, భాస్కర్, చిరంజీవి, శ్రీకాంత్, శాయన శివ, సుదర్శన్, బాజీ, మోకా రవి,శివదాసు, విష్ణు, పవన్ కుమార్ రామానాయుడు, పోతన అశోక్‌కుమార్, మైకేల్, మణికంఠ, నరసింహ, గణేష్ రాజశేఖర్, మహేష్, వీర మహిళలు హేమశ్రీ,కుమారి, ఉషారాణి, జన సైనికులు పాల్గొన్నారు.



సభ్యత్వాన్ని అందజేస్తున్న బండి రామకృష్ణ

13న హైవేలపై దండోరా

ప్రజాశక్తి-గన్నవరం

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత చేయాలని కోరుతూ ఎస్‌సి రిజర్వేషన్ పోరాట సమితి, ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్‌చేశారు. ఆయా సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం గన్నవరంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా గోడ పత్రికలను నాయకులు ఆవిష్కరించారు. గన్నవరం నియోజకవర్గ ఎంఎస్‌పి ఇన్చార్జ్ మందా వేణు అధ్యక్షత వహించారు. ఉభయగోదావరి జిల్లాల పరిశీలకులు మమ్మడివరపు చిన్న సుబ్బారావు, కృష్ణా జిల్లా ఎం ఎస్ పి కో కన్వీనర్ ఐనంపూడి ఆశీర్వాదం, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల సమన్వయకర్త బయ్యారపు రాజేశ్వరావు మాట్లాడారు. బి జె పి అధికారంలో వచ్చిన100 రోజుల్లోనే వర్గీకరణ చేస్తానని చెప్పిందని గుర్తుచేశారు. ఎనిమిదేళ్లు గడుస్తున్నా నేటికీ స్పందన లేదన్నారు.

రక్తహీనతతో అనారోగ్యం

ప్రజాశక్తి-ఉయ్యూరు

రక్తహీనత అనేక వ్యాధులకు కారణమవుతుందని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన డాక్టర్ కళ్యాణచక్రవర్తి అన్నారు. రక్తహీనత పరిణామాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై అడుసుమిల్లి గోపాలకృష్ణయ్య, చెరకు రైతుల (ఏజీ అండ్ ఎస్‌జి) సిద్ధార్థ డిగ్రీ కళాశాల కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం జరిగిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. రక్తహీనత భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారం తదితర అంశాలను వివరించారు. ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడే దేన్నినైనా సాధించొచ్చునని డాక్టర్ జాస్మిన్ సుల్తానా సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సదస్సులో రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ ఎండీ నూర్, ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్లు కె.శేఖర్ బాబు, ఎంఎల్ ఎస్ కుమారిపాల్గొన్నారు.





జెవివి సైన్స్ ప్రదర్శనలో గాజు పెంకులపై నడుస్తున్న బాలిక



స్త్రీ, పురుష సమానత్వంపై

సాహిత్యం ద్వారా చైతన్యం

ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా


ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

స్త్రీ, పురుషులు సమానమని సాహిత్యం ద్వారా ప్రపంచానికి తెలియజెప్పి వారిలో చైతన్యం కలిగించడం ప్రారంభించినట్లు ప్రముఖ స్త్రీవాద రచయిత్ర ఓల్గా అన్నారు. నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న విజయవాడ పుస్తక మహోత్సవ్ ప్రాంగణంలోని గొల్లపూడి మారుతీరావు వేదికపై శనివారం 'ఓల్గాతో ముఖాముఖి' కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమాన్ని ప్రముఖ కవులు బండ్ల మాధవరావు, వొర ప్రసాద్ నిర్వహించారు. ఈసందర్భంగా ఓల్గా మాట్లాడుతూ సమాజంలో పురుషాధిక్యత ఎక్కువగా ఉందని, అయితే ఇద్దరికీ సమాన అవకాశలు కల్పించాలనే ఉద్దేశంతో ఎక్కువగా స్త్రీవాద రచనలు చేశానని అన్నారు. తనకు ఏడేళ్ల వయస్సు వచ్చినప్పటి నుండే సాహిత్యం చదవడం ప్రారంభించినట్లు తెలిపారు. చిన్నపటి నుండి పుస్తకాల మధ్య పెరిగానని, తన ప్రపంచం పుస్తకాలేనని అన్నారు. ఏ పుస్తకం కనిపిస్తే ఆపుస్తకం చదివినట్లు తెలిపారు. ఇంట్లో ఎక్కువగా సోవియట్ అనువాదాలు ఉండేవని, వాటితోపాటు వార పత్రికలు, పక్ష పత్రికలు చదివానని అన్నారు. ఆటలంటే తెలియదన్నారు. తాను ఎస్‌వి కళాశాలలో చదువుతున్న సమయంలో స్నేహితుడు దేవి ప్రియ సాహిత్యం రాసేవారని, ఆదే స్ఫూర్తిగా తాను సాహిత్యం పట్ల అవగాహన ఉండటంతో కథలు, కవిత్వం రాయడం ప్రారంభించానని తెలిపారు. శ్రీశ్రీ సభల్లో అనేకసార్లు పాల్గొన్నానని తెలిపారు.

భావ ప్రకటనా స్వాతంత్ర్యం కోసం రచయితలను అరెస్టు చేయొద్దని జరుగుతున్న ఉద్యమంలో పాల్గొన్నట్లు తెలిపారు. విరసం మహాసభల హాజరైన తనకు ఆ సభల స్ఫూర్తిగా తనకు పూర్తిస్థాయిలో సాహిత్యంపైనే దృష్టి మళ్లిందన్నారు. స్త్రీవాద రాజకీయాల గురించి కూడా ఎక్కువగా కవితలు రాశానని తెలిపారు. తాను తొలిసారిగా అతడు ఆమె నవల రాశానని, ఇందులో ఎటువంటి విమర్శ లేకుండా రచన సాగించినట్లు తెలిపారు. చారిత్రక విషయాలపై స్త్రీలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఎక్కువగా సాహిత్యంలో చారిత్రక అంశాలు ఉండేవిధంగా చేసినట్లు తెలిపారు. 'మీరు రాసిన కష్టమైన నవలులు ఏమన్నా ఉన్నాయా" అని ప్రశ్నించగా, గమనం రెండు నవలలు కొద్దిగా కష్టంగానే ఉన్నాయన్నారు. స్త్రీలు చారిత్రక అంశాలను తెలుసుకోవాలనే ఉద్దేశంతో మహిళవరణం నవల రాసినట్లు తెలిపారు. స్త్రీలపై జరిగిన హింస గురించి తెలియచేసేందుకుగాను 'యుద్ధము శాంతి' నృత్య రూపకం రచించినట్లు తెలిపారు. ఇది 72 నిమిషాల నృత్య రూపకమని, ఎంతో మందిని ఆకట్టుకుందని చెప్పారు. గృహ హింస మీద 'లక్ష్మణరేఖ' నృత్య రూపకం రాసినట్లు తెలిపారు. ఈవిధంగా తన రచనలకు గల స్ఫూర్తిని తెలియచేయడంతో పాటు యువత సాహిత్యంపై మక్కువ పెంచుకోవాల్సిన అవసరం గురించి వివరించారు.

పుస్తక మహోత్సవంలో నేడు...

సాయంత్రం 6 గంటలకు పుస్తక మహోత్సవం ప్రాంగణంలోని గొల్లపూడి మారుతీరావు వేదికపై రాచమల్లు రామచంద్రారెడ్డి శత జయంతి సభ జరుగుతుంది. సాయంత్రం 7 గంటలకు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుంది.




ప్రత్యేక ఆకర్షణగా ప్రజాశక్తి బుక్‌హౌస్, రెడ్ బుక్స్ డే స్టాల్స్





జెవివి సైన్స్ ప్రదర్శన



మాట్లాడుతున్న రాచపాళెం చంద్రశేఖరరెడ్డి



మాట్లాడుతున్న ప్రజాశక్తి బుక్‌హౌస్ ఎడిటర్ ఎస్.వెంకట్రావు





